# అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలి

- చదువుతోపాటు ఆటలకూ ప్రాధాన్యమివ్వాలి
- ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



టార్చ్ రిలే ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

ఖమ్మం సిటీ, అక్టోబర్ 15 : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగి జిల్లా కీర్తిప్రతిష్టలను నలుదిశలా చాటాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆకాంక్షించారు. సీఎం కప్ క్రీడోత్సవాలకు సంబంధించిన క్రీడాజ్యోతి ర్యాలీ మంగళవారం జిల్లాకు చేరింది. ఈ సందర్భంగా క్రీడాజ్యోతి ర్యాలీని నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియం వద్ద స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డితో కలిసి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ జెండా ఊపి టార్చ్ రిలే ర్యాలీని ప్రారంభించారు. విద్యార్థులు, యువకులు, క్రీడాకారులు ర్యాలీలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ ఎంచుకున్న క్రీడల్లో రాణించాలని, రాష్ట్రంతోపాటు దేశానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. త్వరలో జరగనున్న సీఎం కప్ క్రీడా పోటీల్లో పట్టణ, మండల, గ్రామీణ ప్రాంతాల నుంచి ఎక్కువ మంది క్రీడాకారులు పాల్గొనే విధంగా అవగాహన కల్పించేందుకు క్రీడాజ్యోతి ర్యాలీ ఉపయోగపడుతుందన్నారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని క్రీడాకారులకు అన్ని సౌకర్యాలతో క్రీడా వసతులు కల్పించడానికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. సీఎం కప్ ద్వారా ఎంతో మంది క్రీడాకారులు వెలుగులోకి వస్తారని, పల్లెల నుంచి ప్రపంచ విజేతలను తయారు చేయడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. సీఎం కప్ క్రీడా జ్యోతి ర్యాలీ 16 రోజుల్లో 33 జిల్లాల్లో కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి, అధికారులు, కోచ్‌లు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

# పలు కుటుంబాలకు 'నామా' పరామర్శ



పలువురిని పరామర్శిస్తున్న మాజీ ఎంపీ నామా

ఖమ్మం, అక్టోబర్ 15: ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు మంగళవారం నగరంలో పర్యటించారు. పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఖమ్మానికి చెందిన ముల్పూరి నారాయణ ఇటీవల మరణించగా.. బాలాజీనగర్‌లోని వారి ఇంటికి వెళ్లి వారి కుమారుడు, కుమార్తెలను పరామర్శించారు. అలాగే ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న డాక్టర్ వైవీ రామారావును పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్ ఆంధ్రజ్యోతి, డాక్టర్ మిక్కిలినేని విజయకుమార్‌లను అడిగి తెలుసుకున్నారు. పెద్దతండాకు చెందిన చల్లపల్లి రాధమ్మ ఇటీవల మృతిచెందగా వారి నివాసానికి వెళ్లి రాధమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చారు. అలాగే, ఖమ్మానికి చెందిన ప్రముఖ గ్రానైట్ వ్యాపారి వేముల రవికుమార్ సోదరుడు వేముల పూర్ణ – మమత దంపతుల కుమారుడు నవీన్‌కుమార్ వివాహం త్వరలో జరుగనుండగా మంగళవారం ఖమ్మం రాపర్తినగర్‌లోని వారి ఇంటికి వెళ్లి పెళ్లి కుమారుడిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు

















